# ‘అన్నపూర్ణ’ ఆవిర్భవించిందిలా...


‘మిస్సమ్మ’


‘దసరాబుల్లోడు’

ఈనాడు – హైదరాబాద్

అక్కినేని అంటే అన్నపూర్ణ స్టూడియోస్... అన్నపూర్ణ స్టూడియోస్ అంటే అక్కినేని... అంతలా ఆ మహానటుడితో పెనవేసుకుపోయింది ఆ సంస్థ బంధం... అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ సంస్థ నుంచి ఎన్నో ఆణిముత్యాలు వచ్చాయి. అక్కినేని కుటుంబంలో అది ఓ భాగమైపోయింది. అంతటి పేరు ప్రఖ్యాతులున్న ఆ సంస్థ అందరూ అనుకుంటున్నట్లుగా అక్కినేని నాగేశ్వరరావు సతీమణి పేరుమీద ఏర్పడలేదు. యాదృచ్ఛికంగా ఆ సంస్థకు పెట్టిన పేరు, అక్కినేని సతీమణి పేరు ఒక్కటే అయ్యాయి. శరత్ ఫిలిమ్స్ అనే సంస్థను మొదట్లోనే మూసేసిన మధుసూదనరావు తదుపరి ప్రయత్నంగా మరో చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించాలనుకున్నారు. మరోవైపు అంజలీదేవి వ్యక్తిగత అలంకారికుడు (మేకప్‌మన్) గోపాలరావుతో కలిసి అక్కినేని నాగేశ్వరరావు అశ్వనీ ఫిలిమ్స్ సంస్థను ప్రారంభించి ‘మాయలమారి’ అనే చిత్రాన్ని నిర్మించారు. అది విజయవంతమైంది. దీంతో కొత్త సంస్థ ప్రారంభించాలన్న తన ప్రయత్నాలు, ప్రణాళికలను అక్కినేనికి వివరించారు మధుసూదనరావు. అక్కినేని తనకు తోచిన సలహాలు, సూచనలు చేశారు. నవయుగ ఫిలిమ్స్ కార్యనిర్వాహక భాగస్వామి (మేనేజింగ్ పార్టనర్) శ్రీనివాసరావును, మరికొంతమంది భాగస్వాములను కలుపుకొని ఈసారి పకడ్బందీగా రంగంలోకి దిగారు మధుసూదనరావు. తాను భాగస్వామినవుతానని అక్కినేని ముందుకొచ్చారు. మధుసూదనరావూ ఆయన రాకను స్వాగతించారు.




అక్కినేని భాగస్వామిగా చేరుతారన్న వార్తతో శ్రీనివాసరావు చాలా ఆనందపడ్డారు. నాగేశ్వరరావుతో మధుసూదనరావుకు గల సాన్నిహిత్యంద్వారా ఆయన నటించే చిత్రాల పంపిణీ హక్కుల్ని సంపాదించాలన్నది నవయుగ ఫిలిమ్స్ శ్రీనివాసరావు ఆలోచన. సంస్థ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. నామకరణం జరపడమే తరువాయి. మధుసూదనరావు తన పెద్ద కుమార్తె లలిత కుమారి, రెండో కుమార్తె కళ్యాణితోపాటు అన్నపూర్ణ అనే పేరు ఇచ్చి... ఈ మూడింటిలో ఏ పేరు పెడితే బాగుంటుందో సూచించాలని సముద్రాల రాఘవాచార్యులు, నార్ల వెంకటేశ్వరరావులను కోరారు. సంఖ్యాశాస్త్రాన్ని పరిశీలించి అన్నపూర్ణ అనే పేరు అన్ని విధాల బాగుంటుందని సముద్రాల చెప్పారు. అదే పేరును ఖాయం చేశారు. అన్నపూర్ణ అంటే ‘నా భార్య పేరు పెట్టామని అనుకుంటారేమో?’ అనే సందేహం అక్కినేని వెలిబుచ్చారు. ‘అనుకుంటే అనుకోనివ్వు - మరీ మంచిది’ అని మధుసూదనరావు ఆ సందర్భంలో అన్నారట. అన్నపూర్ణ పేరు మధుసూదనరావు సవతి తల్లిది. తనను కన్న తల్లి చిన్నతనంలోనే చనిపోతే చిన్నపిల్లల్ని అల్లారుముద్దుగా పెంచిన ప్రేమమూర్తి అన్నపూర్ణమ్మ. ఆ మహాతల్లి ప్రేమానురాగాల స్మృతి చిహ్నంగా ఆవిర్భవించిందే అన్నపూర్ణ సంస్థ. మొదట కేవీ రెడ్డి లాంటి గొప్ప దర్శకుడితో ‘దొంగరాముడు’ తీసి విజయం సాధించారు. రెండో చిత్రం ‘తోడికోడళ్లు’. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. ఒకేసారి తెలుగు, తమిళంలో తీశారు. రెండు చోట్లా హిట్. మూడో చిత్రంగా ఆదుర్తి దర్శకత్వంలోనే ‘మాంగల్యబలం’ తీశారు. ఇదీ ద్విభాషా చిత్రమే. విజయవంతమైంది. దీంతో అన్నపూర్ణ సంస్థకు హ్యాట్రిక్ దక్కినట్లైంది. అప్పటి నుంచి ఆ సంస్థకు తిరుగులేదు. ఆ తర్వాత అది పూర్తిగా అక్కినేని కుటుంబం చేతిలోకి వచ్చింది.

## అక్కినేని మానస పుత్రిక

అక్కినేని మొండిపట్టుదలకూ, కార్యదీక్షతకు నిలువెత్తు ఉదాహరణ అన్నపూర్ణ స్టూడియోస్. ఇప్పుడంటే జూబ్లీహిల్స్ కళకళలాడిపోతోందిగానీ, అప్పట్లో అక్కడ కొండలూ గుట్టలే. అలాంటి చోట తన సుమధుర స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు ఆయన. దీని వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ‘మహాకవి క్షేత్రయ్య’ సినిమా తీస్తున్న రోజులవి. ఆ సినిమా కోసం నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని ఓ స్టూడియోను సంప్రదించారు. ‘మీకు మేం స్టూడియో ఇవ్వం’ అనేశారట. దాంతో అక్కినేనికి పంతం పెరిగింది. ఆ చిత్రాన్ని కర్ణాటకలో పూర్తి చేశారు. ఇక మీదట ఎవరినీ స్టూడియో అడక్కూడదని నిర్ణయించుకున్నారు. ‘అన్నపూర్ణ స్టూడియోస్’కు అంకురార్పణ అప్పుడే జరిగింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావును సంప్రదించారు. ఆయన స్టూడియో నిర్మాణానికి స్థలం కేటాయించారు. 1976 జనవరి 14న ఆ స్టూడియోలో తొలి చిత్రం ప్రారంభమైంది.